# అంతల్లా దుర్గము

శ్రీమతి మన్య కామేశ్వరీదేవిగారు

ప్రపంచోన్నత ప్రబల సార్వభౌముడును విశ్వవిజయ ధూర్వహుడునునగు 'అక్బరు చక్రవర్తి' సమగ్రార్యావర్త దేశమును నిజాధీనము జేసికొని, తన యధీశత నంగీకరింపక స్వతంత్రుడై నిలచిన మేవాడ మహారాణా ప్రతాపసింహునిపై దండెత్తి యిరువదియైదు వత్సరములవిచ్ఛిన్నముగ సంగ్రామము సాగించి సాఫల్యము బడయకయే 1595లో దన సేనలను రాజధానికి మఱలించుకొని పోయి యుద్ధము నుండి విరమించెను!

ప్రతాప రాణాగారి యనంతర మాయన జ్యేష్ఠ పుత్రుడమర సింహుడు మేవాడ సింహాసనము నధిష్ఠించెను! చెదరిన రాజ్య వ్యవస్థను జక్క దిద్దుకొనుచు—బలములను జేకూర్చుకొనుచు—దుర్గములను మంచి స్థితికి దెచ్చుచు—నమర సింహుడేడెనిమిదేండ్లు కడపెను!

1605 లో పాదుషా యల్లాయం దైక్యమగుట, నాతని కుమారుడు "నూరుద్దీన్ మహమ్మద్ జహాంగీరు" సింహాసన మెక్కెను! అప్పుడు భారత దేశమున నెచ్చటుగాని యుద్ధములు లేక శాంతము నెలకొని యుండెను. జహాంగీరు పాదుషా మాత్రము తండ్రినడుమ విడిచిపెట్టిన మేవాడ దిగ్విజయము బూర్తి గావింపవలెనని మిక్కిలిగా నభిలషించెను. అక్బరు పాదుషాగారికి గుడిభుజమై మేవాడ యుద్ధముల నడపి యాకాలమందలి వీరప్రపంచమునకు వృద్ధోపాధ్యాయుడగు కున్వార్ 'మానసింహ ప్రభువు' సాహాయ్యము నర్థించెను. ఆ మహావీరుడు తన విరోధము ప్రతాపసింహ రాణాతోనే యంతరించెననియు, పూజ్యుడగు నమరసింహ రాణాపై దాను గత్తి పట్టననియు బలికి జహాంగీరు నానతిని నిరాకరించెను. ప్రబల ప్రాభవ వైభవోపేతుడగు మానసింహ మహాప్రభువు నేమనజాలక ఢిల్లీకి మఱలివచ్చి పాదుషా—మేవాడ దండయాత్ర సాగించెను.

మేవాడ పదివేల పల్లెలుగల చిన్న రాజ్యము. ప్రతాప రాణాగారి కాలమున బాతిక వత్సరము లేడతెగని యుద్ధములతో డీలుపడియుండెను. జన బలము తక్కువ—కోశబలమామాత్రమే! అప్పటి కింకను గొన్ని కోటలు మొగలాయీల చేతులలో నుండెను.

పరిస్థితు లెటులున్నను జంకక తన కున్న బలములు గూర్చుకొని మహావీర చూడామణియగు నమరసింహరాణా తండ్రికి దగిన పుత్రుడనిపించుకొనెను.

నాలుగేండ్లు యుద్ధములు జరిగెను. మొగలులకు జయము లవమైన గలుగకుండెను. అమరసింహ ప్రభువు సైన్యములు పలుచపడెను. ఆ వత్సరము స్వామి భక్తాగ్రగణ్యుడును ప్రతాపరాణాగారి ముఖ్యమంత్రియునగు సలుంబ్రా కృష్ణసింహ ప్రభువు జ్వాలాముఖిక్షేత్రమున కరిగియుండి యచ్చటు సూక్తావతుల (సూక్తసింహుని కుమారుల) బోడగాంచి యుదయపురమునకువచ్చి యమరసింహరాణాకీయుదంతము విన్నవించెను. అమర సింహుడాదరహృదయముతో వారిని స్వదేశమున కాహ్వానించెను.

వారందఱువచ్చిరి. భానుసింహుడు, అచలుడు, బలసింహుడు, యోధసింహుడు, చతుర్భుజుడు మహావీరులు. 1612వ సంవత్సర యుద్ధమున నమరసింహ ప్రభువు శత్రు సైన్య మధ్యముజొచ్చి యరుల నుఱుమాడు చుండ శత్రు వీరు లొక్కుమ్మడి వచ్చి యాయన జుట్టుకొనిరి. భానుసింహుడాకలిగొనిన జరఠసింహమువలె విజృంభించి పెక్కురు పగతుర గీటడంచి ప్రభువును దప్పించుకొని తెచ్చెను. ఆ నాడు బలునకు బలుగాయములు దవిలెను.

బలసింహుడు చేసిన సాహస సాహాయ్యమున కలరి యమరసింహుడతని సన్మానింపదలచి యుద్ధములలో సేనాగ్ర భాగమును నడుపు నధికారమును, సభలో దన సింహాసనము నకు గుడిభాగమున నగ్రస్థానమున గూర్చుండు బాధ్యతయు నొసంగెను.

మఱు దినమే మొగలాయి సేనలు మఱల దండెత్తి వచ్చెను. సేనాధీశ్వరులతోఁ సేనలతోఁగదలి యమరసింహు డరాతుల కెదురు నడిచెను.

సాయంకాల మొక మైదానము చేరి గుడారములలో

నిలిచిరి. చోండావత్ప్రముఖులగు దూడాసింగు దేవసింగు విడిసిన గుడారముకడ మాగధుడు కంఠమెత్తి,

గీ॥ "నీ పురమ్ము మేవాడలో నెగడునట్టి
దశసహాస్ర పట్టణ ముఖద్వారము గద!
ఘనజగద్గురు దక్షిణాసనము నీది
నీ మహిమ మద్భుతము, సలుంబ్రామహేంద్ర!"

యని స్తుతించుచుండెను. ఒక మాఱు రెండు మాఱులు గాక మాగధుడు పందల పర్యాయములు పాడుచుండెను. ఈ ధ్వనికి చెవులపిసి దూడాసింగు బయటికరుదెంచి—"మాగధా! యేంటి కంఠగ నఱచుచుంటివి. చాలించి యించుక విశ్రమింపు" మనెను! మాగధుడు కరములు ముకుళించి "మహాప్రభూ! నేను మీ స్తుతి పాఠము చదువుటకే దినమే కడపటి దినమగు నేమో? వంశపారంపర్యముగా దేవరకు దక్కియున్న రాణాగారి దక్షిణ పార్శ్వమందలి యగ్ర పీఠము నేటినుండి సూక్తావతులకు సంక్రమించునని విని, దేవర కీర్తి నేడే హృదయము దనివోంద గీర్తించుచున్నా" ననెను. దూడాసింగు విషణ్ణవదనుడై శిబిరములోని కేగెను!

మైదానమున రాణా కొలువు దీర్చెను! అందఱు కొలువు నలంకరించిరి. వారివారి ప్రాభవాను సారము కూర్చుండిరి. సూక్తావత్ప్రముఖుడు భానుసింహుడు దక్షిణ పీఠము నధివసించెను. అంతలో నమర సింహరాణా సింహాసన మధిష్ఠించెను. దూడాసింహుడు సభకరుదెంచి తన స్థానమున భానుసింగు కూర్చుండి యుండ దిలకించి "బలసింహా! పీఠము నుండి యివ్వలికి దొలంగుము. చందన్రపాలుని కాలమునుండి యీ రెండు వందల యేండ్లు మాకు శాశ్వతాధికారముగల యీ పీఠ మొరులకు స్పృశింపరాదు." కోపావేశుడై,

భానుసింహుడు: నేటివఱకు ప్రభువుల దక్షిణాగ్రస్థానము మీ చోండావద్వీయులదగుట సత్యము. నేడు ప్రభువరాళి మమ్ము సన్మానించి యీ గౌరవము మాకు బ్రసాదించి యున్నారు.

దూడాసింగు: (ఒఱనుండి ఖడ్గము బెఱికి పైకెత్తి) ఇది చోండావతులకు జన్మ బాధ్యత, మా కనుల యెదుట దీని నొరులపహరింప బ్రాణములతో నోర్చుకొనము. ఇది యొరులు తీర్పు చేయునదియుగాదు. ఖడ్గముతో మాత్రము తీఱవలసి యుండును. నీవు ద్వంద్వయుద్ధమునకు సన్నద్ధుడవు గమ్ము!

భానుసింగు: యుద్ధమువలన ఫలాఫలములు సులభముగ నిర్ణయింపబడును. సూక్తావతు లెప్పుడును యుద్ధమునకు వెనుదీయరు.

ఈ సంభాషణము విని సభాస్థానమంతయు గగ్గోలు పడెను. అంతలో సకల కార్య దక్షుడును నిశాత ప్రతిభా విచక్షణుండునునగు—నమరసింహ ప్రభువు లేచి "దూడాసింహ భానుసింహ ప్రభువులారా! నేటి యీ పొరపాటు మా వలన సంభవించినది. కడచిన యుద్ధమున బలసింహుడు నాకొనర్చిన యపార సాహస సాహాయ్యము నా మోదించి సూక్తావతులకీ యమూల్య గౌరవ మొసంగితిమి. పితృ పితామహుల కాలమునుండి యీ మహాగౌరవము చోండావద్వీయులది. అందఱు గౌరవము నిలుచునటులును మీరు కలహించి కూలిపోవుటను వారించునటులను నేనొక మార్గమును దెలుపుదును. అంతల్లాదుర్గ మిచటికి 10 మైళ్ల దూరమున నున్నది. అచ్చట యవనులున్నారు. మీరు భయపక్షముల వీరులును మీమీ బలములతో దరలి వెళ్లి దుర్గము నధీనము చేసికొనుడు. అంతల్లా కోటలో నెవరు ముందడుగిడిన వారికీ గౌరవము మేము స్థిర మొనర్తుము. అట్లు చేయు" డని విన్నవించెను.

శ్రోతలంగఱు హర్షించిరి.

భానుసింహుడు: జగద్గురూ! దేవర యానతి శిరసా వహించి పని యొనర్తుము.

దూడాసింగు: స్వామి శక్తి మా చోండావతుల కుగ్గుతో బెట్టినది. మేవాడ్దేశ ప్రథమ పౌరుడనగు నేను ప్రభుమూర్ధన్యుల చరణముల శిరమున దాల్చి వర్తించెద! మీ యానతి మీఱి చోండావత్కులమునకు గళంకము గొని రాజాలను.

భానుసింహుడు: దేవా! యంతల్లా దుర్గము ప్రవేశించుటకై సూక్తావతులమందఱము విశ్వప్రయత్నము గావింతుము. విజయ లక్ష్మి నుము వరించిన సంతోషమే! అట్లు కాక చోండావతులే తొలుత దుర్గప్రవేశము సాగించిన, లోనుండు యవనభటులు వారి నెదుర్కొని మగ్గునూచముగావింప యత్నింతురు. వారలుల సంఖ్య మిక్కుటము. అట్టి పరిస్థితి

ఘాపురించినపుడు—చోండావతులు గెలుపొంది మా కవమానము గూర్చిరేయని యెుాసునొందక మేమందఱము చోండావతుల పతాక క్రింద జేరి వైరుల మార్కొందుము. అనుజ్ఞ మాలింపుడు.

దూదాసింగు: సూక్తావచ్ఛేఖరా! నీ మాటలు మహావీరపురుషోచితములు. నీ వర్తనము భువనశ్లాఘ్యము! ఇప్పటి నీ సంభాషణము నీ గర్భశత్రులైన సహస్రముఖముల గొనియాడక మిన్నకుండ జాలరు! నీ యాశయము నేను గ్రహించితిని. సాహస సౌభాగ్యముల నలుసుబొ ప్రభువు లోరులకు దీసిపోరు. ఒకవేళ మాయదృష్టము చెడి మీరే జయించిన మా చోండావద్బృంద మంతయు మీ యాజ్ఞను శిరమున దాల్చి విధేయులమై మీ వెంట శత్రువుల నోర్తుము. గెలుపొంది వచ్చి ప్రభుచరణములు గొలువవలయు—లేదా మరణించి వీరస్వర్గము జేరవలయు. మాకు మధ్యే మార్గము లేదు. భూమ్యాకాశములు సాక్షులుగ ప్రమాణము చేసి పలికితిని."

సంతోషాట్టహాసములతో సభయంతయు బూగటిల్లెను! అమరసింహరాణా "ప్రాణములు తృణప్రాయమని భావించి నన్ను సేవించు పరమ వీరులు. మీ నడుమ జిచ్చుదరికొలిపి నాకు నేన హాని గొని తెచ్చుకొంటిని. పాపము శాంతించుగాక"

సభ ముగిసెను బెస్తపల్లె వైపున నొకటియు—బయలున సూటిగా నొకటియు—నంతల్లా కోటకు రెండు మార్గము లుండెను. సూక్తావతులు బలసింహుల నాధిపత్యమున బెస్తపల్లె మార్గమున బయలుదేరిరి. చోండావతుల గొని దూదాసింగు బయలు త్రోవ బయలుదేరెను. కొంత దూరము నడచునప్పటికి మార్గమున దొలినాటి వానవలన నేల యూబియై యుండెను. బురద నేల చాల పొడవుగ వ్యాపించియుండి నందున జోండావతులు దిగి దాటవలసియుండెను. ఇట్లు కొంత కాలము వ్యర్థమయ్యెను. బెస్తపల్లె త్రోవను సూక్తావతులు సులభముగ దుర్గము జేరుకొనిరి. కాని పయనప్పుడొందరలో నిచ్చెనలు దెచ్చుకొన మఱచియుండిరి, కావున వారికి దుర్గ ద్వారమును భిన్నము చేసి లోప్రవేశించుట తప్ప వేఱు మార్గము లేకపోయెను. ఆ కోట పశ్చిమ ముఖమై యుండెను. అచట అంబారి యేనుగనెక్కి ప్రధాన ద్వారమును దాక నారంభించిరి.

మొగలు భటులు గోపురము పైకెక్కి కాచిన నూనెలు పోసియు, శిలలను దొరలించియు వీరి నలయింపసాగిరి. సూక్తావతులు తీసిపోక శూరహర్యక్షసదృశులై తలపడి పోరునడిపిరి. ఇంతలో జోండావతులు కోటను సమీపించి దుర్గ దక్షిణ కుడ్యముల నానించి, నిచ్చెనలు పైకి—యెక్క నారంభించిరి. వైరులు నూనియు పోసి—మొగములు ఫూడునట్లిసుక మూటలను విప్పి పైకెల్లి చేయగలిగిన నిరోధముల నెల్ల చేసిరి. కొన్ని క్షణములలో దేవసింహుండు మెఱపు మెఱసినట్లు నిచ్చెన యెక్కి గోడపై నిలుచుండెను. చోండావద్బలములు పెడబొబ్బలు పెట్టెను. లోపల నిలిచిన మొగలాయి సైన్య పతి లఘునాళాస్త్రమును బూన్చి ప్రేల్చెను. ఆ గుండు వక్షస్థలమున దగిలి దేవసింహుండు విగత ప్రాణుడై కోటబయటికి క్రింద వ్రాలెను. చోండావద్వీరులు క్రుక్కిపోయిరి. దూదాసింహుడు బురదమున నున్న దుప్పటి క్రింద బఱచి దేవసింహుని కళేబరము నందుంచి ముడిచి తన వీపునకు కట్టుకొని దుర్వార ధాటిని నిచ్చెన కెగబ్రాకెను.

శత్రువులు బల్లెములతో గళ్ళలతో బొడుచుచు గొట్టుచున్నను—లక్ష్య పెట్టక—ప్రచండబలమున నెకతొట్టుకొని ప్రాకార కుడ్యము నెక్కె నెప్పుడాయెనంతటిలో వీపున నున్న మూట విప్పి దేవసింహుని కళేబరమును రెండు చేతుల నెత్తి మహావేగమున నది యేబది మూరల దూరము నకు బోయి పడునట్లు విసరి వేసెను. "చోండావతులే ప్రథమమున దుర్గ ప్రవేశము గావించిరి. అందఱు ముందర"డని గర్జించెను. భటులు కొందఱు గోడ యెక్కి పెడబొబ్బలు పెట్టి యట్టహాసము లొనరించిరి.

ఈ ధ్వని సూక్తావతులకు వినబడెను. అచలసింహుడు హస్తిరాజము ద్వారము దాక నుసికొల్పెను. ఆ దుర్గద్వారము పై నినుపరేకు గప్పబడి దాని నిండుగ బొంగరములవంటి యినుప బుడుపులు నిండియుండెను. అచలుని దంతావళ మపుడు స్ఫూర్తి ద్వారమును దగిలెను. కాని వాడి మొనలు గల మేకులు గ్రుచ్చుకొనుటచే దల దిమ్మెక్కి తొండము తల విదులుచుకొనుచు నది వెనుక మొగము పెట్టెను.

## అంతల్లాదుర్గము

అప్పుడచలుండిభము నుండి క్రిందికి దూకి ద్వారము చేరి ఋడుపుల కడ్డముగా దన దేహమునుంచి నిలిచి, "గజమును ప్రేరేపించి తనపైదోలు"మని మావటీని నాజ్ఞాపించెను. వాడును బదులాడనోడి—గజము నుసికొల్పి పుచ్చెను. ఆ ద్వార దమ్మొక్క మెయిదగిలెను. అచలుని దేహమట్టువలె నలిగి క్రింద వ్రాలెను. ద్వారము పగిలి విచ్చుకొనెను.

బలుడు చతుర్భుజుడు. యోధసింహుడందఱు లోనికి బ్రవేశించిరి. కాని చోండావతులే తొలుత దుర్గ ప్రవేశము గావించిరని తెలిసికొనిరి. అప్పటికే గుంపులు గట్టి తురుష్క భటులు పైబడుటవలన దళాధ్వరధ్వంసమునాటి వీర భద్రుడోయన దుర్నిరీక్ష తేజమున నరుల నఱుకుచుండిన దూడాసింగుని సమీపించి.

బలుడు: "చోండావద్వరేణ్యా! జయము మిమ్ము వరించి నందుకు మిమ్ము హృదయపూర్వకముగ నభినందించు చున్నాను. ఆడిన మాట దాటక మేమందఱము మీ యానతి దలదాల్చి శక్తి కొలంది పోరుసాగించెదము.

దూడాసింహు డానందపారవశ్యమున—బలుని కౌగ లించుకొనెను—చోండావతుస్సాక్తావతులే సోదరులవలె స్పర్థ లేక మెలంగి యొక గడియలో గఱకు దురకలను గరవాల ముల కెర చేసిరి.

జాము ప్రొద్దెక్కునప్పటికి శత్రువులు నిశ్శేషముగా దూలిరి.

అంతల్లా దుర్గమున మధ్యభాగమున నించుక యెత్తైన స్థలమున నొకయంతర్దుర్గముండెను — చోండావతులును సూక్తావతులందు బ్రవేశించిరి. దుర్గమున నింత సేపు ముట్టడి సాగుచుండినను నిరువురు మహమ్మదీయ సేనాధీశులు నిమ్మళ ముగా జదరంగము నాడుచుండిరి. చెక్కు చెదరక—నునుతి వాసీలపై నాసీనులయి వారు రాజపుత్ర భటులను జూచి మొరలెత్తి "ఏమీ! కోట మీ యక్కఱ మయ్యెనా! నేను దయచే మేమీ యాట నారంభించితిమి. ఆటయిప్పుడు మంచి శక్తిగల పట్టునకు వచ్చినది. పది నిముసము లవకాశ మిసగుడు ఆట ముగిసిన వెంటనే మమ్ము మీ యిచ్చవచ్చినట్లు చేయవచ్చు" నని వాక్రుచ్చిరి.

దురదృష్టము ప్రబలి సన్నిహితవంశములకు వైరానలము సోకిన దుష్కాలము—ప్రొద్దుటినుండి జరిగిన యుద్ధమున నుభయ పక్షములందలి ప్రముఖులు తెగిన దుఃఖ సమయము— ఎట్లో పదినిముసములు నిలిచిరి. కాని పదపడి వారిరువురు గర వాలములపాలు గావించిరి. సాధారణ సమయముల యందైన చో నుదారముగ బ్రాణదానము గావించి విడిచి పుచ్చెడి వారే! పరిస్థితి యట్టిది.

చోండావతుస్సాక్తావద్వీరులలో బేరుగన్న వారసేకులా యంతల్లాదుర్గమున నంత మొందిరి. సేనాగ్రభాగము నడపు బాధ్యతను రాణాగారి దక్షిణ పార్శ్వమున నగ్రస్థాన గౌరవ మును జోండావత్సింహములకే సంక్రమించెను.

★


# భయపడకుడు

సమస్తవ్యాధుల నివారణోపాయము తెలియ

జేయు "ప్రకృతి వైద్యము"ను గ్రంథము

0—8—0

పోస్టు బిళ్ళలకు పంపబడును.

శ్రీ యోగాశ్రమము (పోస్టు)

మునుఁతోట, (Via) రేపల్లె,

గుంటూరు జిల్లా.


★